# కళా కారుడు

అవసరాల నారాయణరావు

ఆ షాపుపేరు 'కనక మహాలక్ష్మి ఎంపోరియం.'

అక్కడ ... ఒళ్ళు కొల్తలను బట్టి, సైజుకో లంబరు ఇచ్చి, వేర్వేరు సైజుల్లో అందరికీ—ఆడవాళ్ళకు వొంటివి పట్టుకుని బిగువుగా వుండేవీ, మగ వాళ్ళకు కొంచెం వొదులు వొదులుగా వేళ్ళాడేవీ, పిల్లలకు చూడ ముచ్చటగా వుండేవీ – కుట్టిన బట్టలు అమ్ముతారు.

కనక మహాలక్ష్మి ఎంపోరియం తెరిచి అయిదు నిముషాలైంది.

రెండు అగరువత్తులు వెలిగించి, కౌంటర్ దగ్గరున్న లక్ష్మీదేవి పటానికి యీమూల ఒహటీ, ఆ మూల ఒహటీ గుచ్చాడు. ఇంత సాంబ్రాణి వెలిగించి, ఆ పొగను ముందు లక్ష్మీదేవి పటానికి చూపించి, తరువాత షోకేస్ లన్నింటికీ ఓసారి చూపించాడు.

వచ్చి కౌంటర్ దగ్గర కూర్చున్నాడు యజమాని.

ప్యాంటు కాళ్ళకింది మడత దగ్గర శుభ్రంగా చిరిగిపోయి, దారపోగులు వేళ్ళాడుతూన్నాయ్. మోకాళ్ళమీద బెత్తెడేసి మేర మిషన్‌మీద రఫ్ తీసి వుంది. మట్టి రంగొచ్చిన తెల్లచొక్కా కాలరు ఏపొర కాపొర విడిపోయింది. ఆ భుజంమీదా, యీ భుజంమీదా కుట్లు కుట్లలా వుండగానే ప్రక్కనుంచి ఇంత కన్నంపడి, అందులోంచి ఒళ్ళు కనిపిస్తోంది.

కాళ్ళకు చెప్పుల్లేవ్. తలకు నూనె చుక్కలేదు.

మాసిన గడ్డం, బాగా అరిగిపోయిన టూత్ బ్రష్ బ్రిజిల్సులా వుంది.

ఓ డొక్కు వయలిన్ కేస్ చేత్తో పట్టుకుని మెట్లెక్కుతూన్న నడివయసు ఆసామీవైపు క్రీగంటితో ఎగా దిగా చూశాడు కౌంటర్ దగ్గర స్టూలుమీద కూర్చున్న షాపు యజమాని.

'ప్చ!' పెదవి విరిచాడు షాపు యజమాని.

'కళనూ, కళా కారులనూ పోషించే నాథులు కరువై పోయారు!'

వయలిన్ కేసును షావుకి మధ్యగా నడుం ఎత్తుకే వున్న షోకేస్‌పై గాజు పలక మీద అడ్డంగాపెట్టి, అద్దాల బీరు వాలవైపు చూపులు ప్రసరిస్తూ నించు న్నాడు వచ్చి ఆసామి.

"చెప్పండి సార్!... తమ కేం కావాలి?" షాపువాడు అడిగాడు.

"ఒక ప్యాంటూ, ఒక క్లాకూ కావాలి!" వచ్చిన ఆసామి చెప్పాడు.

"తమకేనా?"

"వూఁ"

షాపువాడు చటుక్కున వెనక్కు తిరిగి తలపైకెత్తి, చేయెత్తుకి వున్న బీరువా కుడిప్రక్క గాజు తలుపును ఎడం ప్రక్క గాజుతలుపు వెనుకకు నెట్టాడు. ఓ వరుసలోంచి, ఒక కార్డుబోర్డు బొక్సును ఇవతలకు సగంలాగి, క్షణం ఆగి ఆ ఆసామివైపు ఓసారి ఎగాదిగా చూసి, మరి ఏమనుకున్నాడో; దానిని మళ్ళీ వెనక్కు తోసేశాడు. అదే బీరు వాకు అట్టడుగున కాళ్ళదగ్గర వున్న దుమ్ము కొట్టుకుపోయిన అట్ట పెట్టె ల్లోంచి, ఓ పెట్టెను ఇవతలకు తీసి, దాని మీద స్థిరపడ్డ దుమ్మును నోటితో 'వుఫ్ఫ్' అని వూది, మూతతీసి ఆ ఆసామీ ముందు పెట్టాడు.

"బిస్నీది సార్!...నాలుగేళ్ళ పాటు దుక్కలా పడివుంటుంది. మా పాగుతుంది. ఇలాంటి దొక్కటుంటే చాలు, రోజులు వెళ్ళిపోతాయ్!"

ముదురాకు పచ్చరంగు పంట్లాం మడతవిప్పి, గుడ్డ నాణ్యతనూ, గట్టి తనాన్నీ ఇంప్రెస్ చెయ్యాలని, పంట్లాం తాలూకు ఓ కాలును ఎడంచేత్తో నొక్కి పట్టి, కుడిచేతి వేళ్ళతో గుడ్డను పట్టుకుని బలంగా లాగి చూపించాడు.

"ఎంతా?" ఆసామీ అడిగాడు.

"అందరికీ పది రూపాయల కమ్మి కమ్మతున్నాను సార్!...మీకు ఎనిమిది రూపాయల కిచ్చేస్తాను పట్టుకు పోండి!"

ఆ ఆసామీ చిన్నగా నవ్వుతున్నాడు.


"సరే...ఇదిలా వుండనివ్వండి, చూద్దాం. చదరంగం గళ్ళ క్లాకు లున్నాయా?"

"లేకపోవటం ఏవిటి సార్?... కావలసినన్ని వెరైటీ సున్నాయ్."

నాలుగైదు రకాల క్లాకుల్ని తీసి ఇవతల పడేసి, ఒక్కొక్క దాన్నీ విప్పుతూ, వాటి వాటి ధరలను చెప్పాడు షాహుకారు.

నలుపూ తెలుపూ గళ్ళ క్లాకూ, ముదు రాకు పచ్చ ప్యాంటూ తీసుకుని, పంట్లాం జేబులోంచి పది రూపాయల కాగితం తీసి షాహుకారు చేతిలోపెట్టాడు ఆ ఆసామీ.

కిట్ట దన్నాడు షాహుకారు.




క్రీట్టించుకో మన్నాడు ఆసామీ.

ఇలా కొంచెం సేపు కిందా మీదా పడ్డాక, ఇంకో రూపాయ్ చేతిలోపెట్టి, షాహుకార్ని వూరుకో పెట్టాడు ఆ ఆసామీ.

"ఇప్పుడు తొడిగేసుకుంటావా ?"

"వూ("

"అయితే... అదిగో... ఆ గదిలోకి వెళ్ళండి !"

ఎదురుగా, పెద్ద పోస్టాఫీసుల్లో వుండే పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లా వున్న ఓ చేకుకక్ర గదిని చూపించాడు షాహుకారు.

బోల్టు వేసుకుని, బట్టలు మార్చుకున్నాడు. తలుపుకి లోపలి పక్క అమర్చబడిన నిలువుటద్దం ముందు నించుని, క్లాకు కాలరును సర్దుకుంటూ తనలో తను మురిసిపోయాడు.

కట్టు విడిచిన బట్టలను ఖాళీచేసిన కొత్తబట్టల అట్ట పెట్టెలోపెట్టి, దానిని చేత్తోపట్టుకుని ఇవతలకు వచ్చాడు.

"చూడండి !...షాహుకారు గారూ !... ఇక్కడే. ప్రకాశరావు పేటలో చిన్న పనివుంది... చూసుకుని ఇప్పుడే వస్తాను. అంత వరకూ ఈ రెండింటినీ ఇక్కడ వుంచుతాను. కొంచెం చూస్తూం టూరా ?"

వయలిన్ కేస్ ప్రక్కన అట్ట పెట్టెను జోడించాడు. ఆ ఆసామీ.

"ఎక్కడికీ పోవు. వెళ్ళిరండి సార్ !"

ఆ రెండు శాల్తీలనూ షోకేస్ గాజు పలకమీద ఓ వా ర గా జ రి పా డు షాహుకారు.

ఓ గంటయింది.

ఇంకో గిరాకీ తగిలింది షాహుకారికి.

ఈయన చక్కగా కుచ్చెళ్ళు పోసి, సన్నని గ్లాస్కోపంచి కట్టుకున్నాడు, బెంగాల్లాల్చీ తొడుకున్నాడు. పూదారంగు అంచు, పైకి కనిపించేలా మడతపెట్టి వున్న తెల్లకండువా రెండు కొనలూ మెడమీంచి ముందుకి మోకాళ్ళదాకా వేళ్ళాడేలా వేసుకున్నాడు.

పొట్టి క్రాఫింగ్, వెనక ఓ చిట్టి పిలక.

కనుబొమలకు మధ్య నుదురుమీద నయాపైసంత కుంకుమబొట్టు.

కాళ్ళకు అడ్డం పడుతున్న పంచి, కింది కుచ్చిళ్ళను చేత్తో కొంచెం పైకెత్తి పట్టుకుని, మెల్లెక్కుతూన్న ఆయన్ని చూసి, కౌంటర్ దగ్గర అంతవరకూ స్టూలుమీద కూర్చున్న షా హు కా రు చటుక్కునలేచి, "దయచేయండయ్యా :... దయచేయం" డంటూ, షోకేస్ వైపు వెళ్ళాడు.

"పదేళ్ళ పిల్లవాడికి ఓ నిక్కరూ, చొక్కా మంచివి ఇవ్వండి !"

"సరే సార్ !" ఫ్యాన్ స్విచ్ వేసి, ఖరీదైన జతలు ఏ బీరువాలో వున్నాయో జ్ఞాపకం చేసుకునే ప్రయత్నంలో షాహుకారు, తలెత్తి, పైబీరువాలవైపు వరసబెట్టి చూస్తున్నాడు.

పొట్టను షోకేస్ అంచుకు ఆనించి వింటుని, షాపంతా కలయజూస్తున్నాడాయన.

ఆయన దృష్టి వయలిన్ కేస్ మీద పడింది.

"వయిలిన్‌లు కూడా అమ్ముతారేవిటీ మీరు ! ?"

ఆయన ఆశ్చర్యంగా అడిగాడు.

"అబ్బే లేదుసార్ !" షాహుకారు చిన్నగా నవ్వుతూ అన్నాడు," ఓ కస్టమర్ ఇప్పుడే వస్తానని ఇక్కడ పెట్టి ఎక్కడికో వెళ్ళాడు.

"ఓహో ! అట్లానా !" అనీ, ఆయన చొరవగా వయలిన్ తీసి, వాయించటం మొదలెట్టాడు. షాపు యజమాని అభ్యంతరం చెప్పలేకపోయాడు.

ముందు, 'సా' ... 'పా' ... 'సా' వాయించి, చిన్న వర్ణం ఎత్తుకున్నాడాయన.

పల్లవి ఒక్కటీ వాయించాడంతే.

మళ్ళీ వయలిన్‌ను కేస్‌లో పెట్టేస్తూ, అన్నాడాయన; "ఎవరిదో కానీ ...ఫస్ట్ క్లాస్ జర్మన్ వయలిన్. నాలుగొందలు పెట్టినా దొరకటంలేదీరోజుల్లో !"

"ఆఁ !... అలాగా సార్ !" గుడ్లు పెద్దవిచేసి, ఆశ్చర్యంగా చూస్తూ, "అంత మంచి వయలిన్నేం ?" అన్నాడు షాహుకారు.

"కేసంటే దొక్కుదికానీ. ఇన్‌స్ట్రుమెంట్ మాత్రం అయిదు వందలన్నా కూడా కళ్ళకద్దుకు ఎత్తుకు పోతారు."

ఆయన ఏజత తీసుకున్నాడో ?...

తను ఎంతఖరీదు చెప్పాడో ?...

ఆయన ఎంత చేతిలో పెట్టాడో ?...

— షాహుకారికి తెలీదు!

ఆయన వెళ్ళిపోయాడు.

వయలిన్ వైపు చూస్తూ అలాగే కూర్చున్నాడు షాహుకారు!

ఓ గంటయింది.

మొదటి ఆసామీ తనపని చూసుకుని తిరిగి వచ్చాడు షాపుకి.

"వస్తానండి షాహుకారు గారూ!" అంటూ ఎడంచేత్తో అట్టపెట్టీ, కుడుచేత్తో వయలిన్ కేసూ తీసుకోబోతూంటే, షాహుకారు అన్నాడు!

"అవునుగాని బాబూ!... అంత దొక్కు వయలిన్ పెట్టుకున్నారేవిటీ ? .. అమ్మి పారెయ్యక."

షాహుకారు ఆమాటన్నందుకు ఆ ఆసామీ నొచ్చుకోలేదు.

"దాన్ని అమ్మిపారేస్తే, నేను బ్రతికేదెలా ?... నా జీవనోపాదదదే."

"అమ్మి పారేసి కొత్తది కొనుక్కోండి సార్!...మీలాంటి విద్వాంసులకు ఎలాటి పనిముట్టు వుండాల?"

"అమ్మితే దాన్ని కొనేవాళ్ళెవరండీ ?" పేలవంగా నవ్వాడు ఆ ఆసామీ.

"ఏదో ధరకట్టి పోసీ నాకే ఇచ్చెయ్యండి!"

"నాతో ఎందుకండీ హాస్యం ఆడతారూ ?"

"హాస్యం కాదండీ!... నిజంగానే చెబుతున్నాను. పొందిస్తాను ... ఇచ్చెయ్యండి."

"హూఁ ... వంద రూపాయలకు ఇండియాలో తయారైన సెకండ్ హ్యాండ్‌దే రాదు... మూడొందలు చేసి తీసుకోండి "

"మీరన్నదీ కాదు; నేనన్నదీ కాదు, రెండొందలు చేసి ఇచ్చెయ్యండి!" ఒక్కసారే రెండొందలు అనేసినందుకు నొచ్చుకున్నాడు షాహుకారు.

క్షణం సేపాలోచించి, "అయితే సరే. తీసుకోండి!" అని వయలిన్‌ను అక్కడ పెట్టేసి, రెండు పచ్చ నోట్లను జేబులో పెట్టుకుని. వెళ్ళిపోయాడు ఆ ఆసామి.

కొట్టు కట్టేసి, ఇంటికి వెళ్ళేముందు, దారిలోవున్న మ్యూజిక్‌షాపు కెళ్ళాడు షాహుకారు, కొన్న వయలిన్‌ను చేత్తో పట్టుకుని.

ఆ కొట్టు యజమాని, వయలిన్‌ను అటూ ఇటూ, చుట్టూ తిప్పి చూశాడు. కిందా మీదా ఓసారి వేళ్ళతో టక టక కొట్టి మోగించి చూశాడు.

చూసి, "మీ ఇంట్లో ఆడుకునే చిన్న పిల్లలెవరూ లేరా?"అన్నాడు వయలిన్‌ను తిరిగి నొక్కుతున్న షాహుకారి చేతిలో పెట్టేస్తూ!